ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది:05.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై మదన్ బి. లోకూర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ కోరాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది.

2. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు సీబీఐ విచారణను తెరపైకి తెచ్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు

3. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్కులో 453 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు కానున్న 'ఐటీపీ ఏరో - ఇండియా' ప్లాంట్‌కు మంత్రి శ్రీధర్ బాబు ఇవాళ భూమి పూజ చేశారు.

4. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం చారిత్రాత్మకమని, 15 ఏళ్ల తృణమూల్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

5. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

**కేబినెట్ సమావేశం**

నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై మదన్ బి. లోకూర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ కోరాలని కేబినెట్ నిర్ణయించింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయరాదని మంత్రులను ఆదేశించింది. భూముల విలువలను శాస్త్రీయంగా సవరించి ఈనెల 26 నుండి అమలు చేయాలని, హిల్ట్ పాలసీ దరఖాస్తుదారులకు పాత ధరలకే అవకాశం కల్పించాలని నిర్ణయించింది. నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం నిర్వహణను ఎన్‌డీడీబీకి అప్పగించే ఎంఓయూకు ఆమోదం తెలిపింది. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు, ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిల కోసం ఓటీఎస్ విధానానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపింది.

**పీటీసీ - హైదరాబాద్**

**కిషన్ రెడ్డి**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం చారిత్రాత్మకమని, 15 ఏళ్ల తృణమూల్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నిన్న ఢిల్లీ లో మీడియా తో కిషన్ రెడ్డి  మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంపై నమ్మకంతోనే ఈ భారీ మెజార్టీ దక్కిందని, బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు తీస్తుందని పేర్కొన్నారు. ఈ ఫలితాల ప్రభావం తెలంగాణపై సానుకూలంగా ఉంటుందని, రాష్ట్రంలో కాంగ్రెస్, కేసీఆర్

మార్కు అవినీతిని అంతం చేసే శక్తి కేవలం బీజేపీకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణాదిలోనూ బీజేపీ విజయకేతనం ఎగురవేస్తుందని జోస్యం చెప్పారు. అనంతరం ఎంపీ డీకే అరుణతో కలిసి కార్యకర్తలకు మిఠాయిలు తినిపించి, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ నెల 10న ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని కిషన్ రెడ్డి వివరించారు.

**డెస్క్**

**విశాఖ రైల్వే జోన్**

విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూన్ 1 నుంచి ఈ కొత్త జోన్ అధికారికంగా అందుబాటులోకి రానుంది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ జోన్ పరిధిలోకి తీసుకొచ్చింది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నుంచి కొన్ని ప్రాంతాలను కలిపి దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు చేస్తున్నట్లు గెజిట్‌లో కేంద్రం పేర్కొంది. రాయగడ నుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్‌లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది.

**డెస్క్**

**హైడ్రా**

శంషాబాద్ కొత్వాల్‌గూడలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పలు కంపెనీల క్రషర్ మిషన్లు, 12 ఆర్ఎంసీ యూనిట్లను హైడ్రా కూల్చివేసింది. కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్ శాఖల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టింది.

వందల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా, అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో హైడ్రా రంగంలోకి దిగి వీటిని తొలగించింది.

**డెస్క్**

**నాగర్‌కర్నూల్**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తాడూర్ మండలంలోని గుంతకోడూరు గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు రావాలని, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పనుల నాణ్యతను, పురోగతిని పర్యవేక్షించిన కలెక్టర్, ఫీడర్ ఛానల్ పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ చిన్న ఓబులేసు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పీటీసీ – నాగర కర్నూల్**

**బండి సంజయ్**

కరీంనగర్ జిల్లా ఖాజీపూర్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, రైతుల సమస్యలు వినకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిధులు ఇస్తున్నా వడ్ల సేకరణలో జాప్యం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరుగు పేరుతో దళారులు అన్నదాతలను దోచుకుంటున్నారని విమర్శించారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి గానూ కేవలం 15 లక్షల టన్నులే సేకరించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. విద్యుత్ అక్రమాల నివేదికపై చర్యలు తీసుకోకుండా

ఇప్పుడు సీబీఐ విచారణ కోరడం కేవలం ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అని అన్నారు. రైతులకు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్లకు నిధుల్లేవా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

**పీటీసీ - కరీంనగర్**

**రఘునందస్ రావు**

దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని, ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. ఇవాళ  ఖమ్మంలో పర్యటించిన రఘునందన్, ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభ విజయవంతం కోసం స్వయంగా గోడ పత్రికలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుటుంబ పాలనను ప్రజలు తిరస్కరిస్తున్నారని, బెంగాల్ నుండి తమిళనాడు వరకు వస్తున్న మార్పులే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇండియా కూటమి పేరుతో కపట నాటకాలు ఆడుతున్నారని, కేరళలో వారి మధ్య ఉన్న వైరుధ్యాలే అందుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఫసల్ బీమా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ప్రజల తీర్పు ఎప్పుడూ అభివృద్ధి, విశ్వసనీయత వైపే ఉంటుందని, మోదీ నాయకత్వంలో బీజేపీ దేశవ్యాప్తంగా తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

**డెస్క్**

**పశువుల అక్రమ రవాణా**

నల్లగొండ జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వివిధ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచినట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై పశుగ్రాస క్రూరత్వ నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద కఠిన కేసులు నమోదు చేస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. మూగజీవాల రక్షణలో ప్రజలంతా సహకరించాలని కోరారు.

**పీటీసీ - నల్గొండ**

**మంచిర్యాల**

ప్రతీ రైతు భూసారాన్ని పరీక్షించుకుని ఫలితాల ఆధారంగా ఎరువు లు వినియోగించాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని సండ్రోన్పల్లి రైతువేదికలో భూసార పరిరక్షణ, పంటమార్పిడి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేలలో సేంద్రియ కర్బన శాతం పెరగడం ద్వారా భూసారం పెరిగి పంటలో నాణ్యమైన దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

**పీటీసీ – మంచిర్యాల**

**కార్మికుల సమ్మె**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాలిస్టర్ వార్పిన్ కార్మికుల సమ్మె 9వ రోజుకు చేరింది. కూలి ఒప్పందం ముగిసి రెండేళ్లు గడిచినా, యజమానులు వేతనాలు పెంచకుండా

కాలయాపన చేస్తున్నారని పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ విమర్శించారు. కార్మిక శాఖ చర్చలు జరిపినా ఫలితం లేదని, వెయ్యి పోగులకు 37 రూపాయల కూలి ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

**రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ జయ ఒక ప్రకటనలో కోరారు. మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఈ నెల 7వ తేదీ చివరి గడువుగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. అర్హత కలిగిన గిరిజన విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, గడువు ముగిసేలోపు ఆన్‌లైన్ లేదా నిర్దేశిత పద్ధతిలో నమోదు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ల గురించి మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

**శ్రీధర్ బాబు**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్‌వేర్ పార్కులో 453 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు కానున్న 'ఐటీపీ ఏరో - ఇండియా' ప్లాంట్‌కు మంత్రి శ్రీధర్ బాబు ఇవాళ భూమి పూజ చేశారు. పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ యూనిట్

విమాన ఇంజన్లకు అవసరమైన కీలక భాగాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ఏరోస్పేస్ తయారీ రంగానికి కొత్త ఊపు రావడమే కాకుండా, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలవనుంది. అధునాతన ప్రిసిషన్ ఇంజనీరింగ్ పద్ధతులతో ఇక్కడ ఉత్పత్తులు సిద్ధం కానున్నాయి.

**పీటీసీ - హైదరాబాద్**

**గ్లోబల్ సర్వీస్ హబ్**

జర్మనీకి చెందిన 160 ఏళ్ల చరిత్ర కలిగిన అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'బి.ఏ.ఎస్.ఎఫ్' (BASF) హైదరాబాద్‌లో తన గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈరోజు తాజ్ కృష్ణలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఈ మేరకు 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'ను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు అందజేశారు. ఈ కేంద్రం ద్వారా ఫైనాన్స్, హెచ్ఆర్, గ్లోబల్ సర్వీస్ డెలివరీ విభాగాల్లో సుమారు 3 వేల మందికి కొత్తగా ఉపాధి లభించనుంది. 200 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ కెమికల్స్, అగ్రికల్చరల్ సొల్యూషన్స్ వంటి రంగాల్లో అగ్రగామిగా ఉంది.

**డెస్క్**

**భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై మెడికల్ ఆఫీసర్లతో డీఎంహెచ్వో తుకారాం రాథోడ్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో 98% లక్ష్యాన్ని సాధించినట్లు.. మిగిలిన 2% లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసి 100%

సాధించవలసిందిగా వైద్యాధికారులకు సూచించారు. అలాగే వేసవికాలం దృష్ట్యా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే వడదెబ్బకు సంబంధించిన వివరాలను కూడా ఎప్పటికప్పుడు నివేదికను జిల్లాకు సమర్పించాలని డీఎంహెచ్వో మెడికల్ ఆఫీసర్లకు చెప్పారు.

**పీటీసీ - భద్రాద్రి కొత్తగూడెం**

**నకిలీ నోట్ల ముఠా**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ నోట్లను తయారు చేసి, చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ టాస్క్ ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నకిలీ నోట్ల తయారీ, మోసాలకు పాల్పడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. నిందితులు ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్ల సహాయంతో అసలు నోట్లను పోలిన నకిలీ కరెన్సీని ముద్రించి మార్కెట్‌లో చలామణి చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుండి నకిలీ నోట్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, మొబైల్ ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

**పీటీసీ – వరంగల్**

**రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే ధాన్యం లారీలను రైస్ మిల్లర్లు వెంటనే అన్ లోడింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం హమాలీల సంఖ్యను

పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం సేకరణలో జాప్యం జరగకుండా చూడాలని, రవాణా కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన ఆదేశించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**